- చేతి గుర్తును నమ్మితే.. తినే కంచంలో రాళ్లేసుకున్నట్లే..
- ఆ పార్టీ నేతలకు మతిభ్రమించింది
- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు తప్పవు

- దేశంలో ఎక్కడాలేని పథకాలు తెలంగాణలో అమలు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


గట్టు మండలం అంతంపల్లిలో బొడ్డెమ్మ ఆడుతూ ఎమ్మెల్యే బండ్లకు స్వాగతం పలుకుతున్న మహిళలు


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల

గట్టు, నవంబర్ 20 : కాంగ్రెస్ వస్తే కష్టాలు మళ్లీ తప్పవని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తేల్చి చెప్పారు. మండంలోని తుమ్మలపల్లి, మిట్టదొడ్డి, ముచ్చోనిపల్లి, అంతంపల్లి, లింగాపురం, బోయలగూడెం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. హస్తం పార్టీకి ఓటేస్తే తినే కూట్లో మట్టి వేసుకున్నట్లేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు ఎవరికి తోచింది వారు మాట్లాడుతున్నారని, వారి తీరు చూస్తుంటే మతిభ్రమించినట్లు అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఒకరేమో ధరణి తీసేస్తామని చెబుతున్నారని, మరొకరేమే పాత రెవెన్యూ వ్యవస్థను తీసుకొస్తామంటున్నారన్నారు. ఇలాంటి వారికి ఓటు వేసి గెలిపిస్తే కాంగ్రెస్ పాలనలోని పాతరోజులను మళ్లీ చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను అధిగమించాలంటే మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆదరించాలని కోరారు. బీఆర్ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని భరోసా ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని కితాబిచ్చారు. గత ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదేని విమర్శించారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు అన్నదాతను అన్నివిధాలా ఆదుకుంటున్నాయన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి కుటుంబాలకు ధైర్యాన్నిస్తున్నాయన్నారు. ఆసరా పింఛన్లు వృద్ధులు, వితంతులు, వికలాంగులకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. ప్రచారంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, గడ్డం కృష్ణారెడ్డి, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్‌ఎంపీపీ మేకల సుమతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బాసు హనుమంతు, రామాంజనేయులు, గద్వాల తిమ్మప్ప, రాముడు, హనుమంతురెడ్డి, రామునాయుడు, బజారి తదితరులు పాల్గొన్నారు.


అంతంపల్లిలో ప్రచారంలో పాల్గొన్న దివ్యాంగుడు


బీఆర్ఎస్ జెండాలతో ప్రచారంలో పాల్గొన్న మహిళలు


పుల్లూరులో విజయుడికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న నాయకులు

## మరోసారి బీఆర్ఎస్‌దే అధికారం

- అలంపూర్ గులాబీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు

ఉండవెల్లి, నవంబర్ 20 : మరోసారి బీఆర్ఎస్‌దే అధికారమని అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు పేర్కొన్నారు. మండలంలోని పుల్లూరు గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తెలంగాణ ప్రభుత్వం ఆమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో అలంపూర్ చౌరస్తాలో వంద పడకల దవాఖానను నిర్మించి ప్రారంభించుకున్నామన్నారు. అలంపూర్, వడ్డేపల్లి నూతన మున్సిపాలిటీలుగా ఎర్రవల్లి మండల కేంద్రంగా ఏర్పాటు చేసుకొని కోట్ల రూపాయలతో సెంట్రల్ లైటింగ్స్, సీసీ రోడ్ల నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించుకున్నామని వివరించారు. అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ రాష్ట్రంగా అవతరించిందని, మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను సీఎం చేయాలని కోరారు. ప్రభుత్వం గత పదేండ్లలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ బీమా, సన్నబియ్యం పంపిణీ, పింఛన్లు, రైతుబంధు పెంపు, రూ.15లక్షల ఆరోగ్య బీమా వంటివి అమలవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు చేసి అత్యధిక మోజార్టీతో తనను గెలిపించాలని విజయుడు కోరాడు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కారుకు జైకొట్టిన ఆర్ఎంపీలు

అలంపూర్, నవంబర్ 20 : నియోజకవర్గంలోని ఆర్ఎంపీలు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు నియోజకవర్గ గ్రామీణ వైద్యుల సంఘం తాలూకా అధ్యక్షుడు మురళీ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ హుస్సేన్ తెలిపారు. సోమవారం 120మంది ఆర్ఎంపీలు ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే అబ్యర్థి విజయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. కొంతకాలంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్సీ, విజయుడికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు తనగల విష్ణువర్ధన్‌రెడ్డి, కలుకుంట్ల ఆంజనేయులుగౌడ్, వల్లూరు కిశోర్ సూచన మేరకు బీఆర్ఎస్‌కు జైకొట్టినట్లు వారు పేర్కొన్నారు.

**విజయుడికి టీఎమ్మార్పీఎస్ మద్దతు**

అలంపూర్, నవంబర్ 20 : తెలంగాణ ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర్ హుస్సేన్, అలంపూర్ తాలూకా అధ్యక్షుడు ప్రేమదాసు ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా అలంపూర్ పట్టణ టైలర్ అసోసియేషన్ సభ్యులు కారు గుర్తుకె ఓటు వేసి విజయుడిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈమేరకు వారు సోమవారం ఎమ్మెల్సీ చల్లా, విజయుడిని కలిశారు.


ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని కలిసి మద్దతు తెలుపుతున్న గ్రామీణ వైద్యులు

## నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణ

- 30వ తేదీన 144సెక్షన్ అమలు చేయాలి
- ఎన్నికల అబ్జర్వర్లు అజయ్ వినాయక్, దీపక్ మిశ్రా
- రెండు నియోజకవర్గాల్లో బరిలో 33మంది అభ్యర్థులు
- జిల్లా వ్యాప్తంగా 590 పోలింగ్ కేంద్రాలు, 4,89,945మంది ఓటర్లు
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల, నవంబర్ 20 : సాధారణ శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్లు అజయ్ వినాయక్, దీపక్‌మిశ్రా అన్నారు. సోమవారం జిల్లాకు చేరుకున్న అబ్జర్వర్లను కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితిరాజ్ కలిసి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ పరిశీలకులు అనుపమశర్మ, సాధారణ ఎన్నికల పరిశీలకులు వసంత్‌కుమార్‌తో కలిసి శాసనసభ ఎన్నికలపై కలెక్టర్, ఎస్పీ, రిటర్నింగ్ అధికారులు, పోలీస్, నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల వేళ టోల్‌ఫ్రీ 1950 నంబర్‌కు, అదేవిధంగా ఫిర్యాదుల సెల్‌కు వచ్చే అన్ని ఫిర్యాదులను ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేసి నమోదు చేయాలన్నారు. సాధారణ పరిశీలకులు పోలింగ్ రోజు కంట్రోల్ రూంకు వెళ్లి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రక్రియను గమనించాలన్నారు. రాష్ట్రస్థాయి ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా మాట్లాడుతూ అదనపు బలగాలను రిజర్వర్‌లో ఉంచుకోవాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే అత్యవసర సమయంలో వారిని వినియోగించుకోవాలని సూచించారు. అన్ని పోలింగ్ బూతులు మ్యాపింగ్ చేయాలని, పోలింగ్ రోజు ఎక్కువమంది ఒకచోట గుమిగూడకుండా 144 సెక్షన్ విధించాలని, పోలింగ్ కేంద్రంలోకి ఎవరెవరిని అనుమతిస్తారో ప్రతి పోలింగ్ అధికారి ముందే తెలుసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి లోపలికి పంపాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి కౌటింగ్ సెంటర్ వరకు ఈవీఎంలను తీసుకెళ్లే వాహనాలకు వెనుక పైపు కెమెరాలు అమర్చాలని, మధ్యలో ఆపకుండా తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ క్రాంతి జిల్లాలో శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. రెండు నియోజకవర్గాల్లో 33మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 590 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 4,89,945మంది ఉన్నారని వివరించారు. కొత్తగా ఓటర్ గుర్తింపు పొందిన వారి కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఈవీఎంల ర్యాండమైజేషన్, 12-డీ ఫారం పంపిణీ, మోమ్ ఓటింగ్ తదితర అంశాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అనంతరం ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు, 30వ తేదీన జరిగే ఎన్నికలకు సంబంధించి పోలీస్ శాఖ పరంగా తీసుకున్న చర్యలు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, శ్రీనివాసులు, ఆర్డీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అబ్జర్వర్లు